
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025





ఎల్ఎండీ వద్ద సందర్శకుల వాహనాలు

151 వాహనాలు సీజ్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పర్యవేక్షణ, పరిరక్షణలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని 20 ప్రధాన కూడళ్ల వద్ద దాదాపు 150 మంది పోలీసులతో నాకాబందీ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 151 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రివెంటివ్ చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని, నంబర్ ప్లేట్ లేని, టాంపర్ చేసిన వాహనాలను, సరైన ధృవపత్రాలు లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 53 వాహనాలు, నంబర్ ప్లేట్ సరిగా లేని, టాంపర్ చేసినవి 80, సరైన ధ్రువపత్రాలు లేనివి 11, నంబర్ ప్లేట్ లేనివి ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు తమ వాహనాలను సరైన ధృవపత్రాలతో, నిబంధనలకు అనుగుణంగా నడపాలని సూచించారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం

- బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు
- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



శంకరపట్నంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

శంకరపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో రేషన్‌కార్డుల పంపిణీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు నాసిరకం దొడ్డు బియ్యం పంపిణీ చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా రేషన్ వ్యవస్థలో విప్లవత్మకమైన, చరిత్రత్మాకమైన మార్పును తీసుకువచ్చిందనిరు. గతంలో పంపిణీ చేసిన దొడ్డురకం బియ్యం తిరిగి ఫౌల్ట్రీ ఫాములు, రైస్



గట్టుదుద్దెనపల్లి సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు

మిల్లులకు తరలిపోయేదన్నారు. గత పదేళ్ల బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, పాత రేషన్‌కార్డుల్లో సభ్యులను నమోదు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదనంగా 8.64 లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసిందన్నారు.

గతంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2.81 కోట్ల మందికి నాసిరకం దొడ్డు బియ్యం ఇస్తుంటే ప్రస్తుతం 3.17 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నా మన్నారు. తెలంగాణలోని 84 శాతం మందికి ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందజేస్తు న్నామన్నారు. మాన కొండూర్ నియోజకవర్గంలో 55 వేల రేషన్ కార్డులు ఉంటే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తగా 5,992 రేషన్‌కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. పాత రేషన్‌కార్డుల్లో 13,220 మందిని చేర్చామన్నారు.

లక్ష కోట్లు రైతులకు ఇచ్చాం..
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



పేదలు, బడుగు బలహీన వర్గాలు, రైతాంగ సంక్షేమ కోసం కోసం లక్ష కోట్లు వెచ్చించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



పేదల సంక్షేమమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎంత

(మిగతా 8వపేజీలో)

మానేరుకు సందర్శకుల జాతర

తిమ్మాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయానికి ఆదివారం సందర్శకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో డ్యాంలో విపరీతమైన రద్దీ నెలకొంది. డ్యాం కట్ట దిగి నీటి ప్రవాహం ఉన్న చోటుకు సందర్శకులు తమ వాహనాలతో తరలి వెళ్లారు. కొందరు యువకులు అందరి ముందు మద్యం సేవించడంతో కుటుంబ సమేతంగా వచ్చిన సందర్శకులు ఇబ్బందిపడ్డారు. రాత్రి పొద్దు పోయే వరకు సందర్శకులతో దిగువ మానేరు జలాశయం కిక్కిరిసి పోయింది. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్, కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది చేరుకొని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా, క్రమబద్ధీకరించి రాత్రి కావడంతో సందర్శకులను అక్కడి నుంచి పంపించి వేశారు.

రసాభాసగా అర్బన్ బ్యాంక్ సమావేశం

- కోర్టు ఉత్తర్వులతో గత పాలకవర్గం 15 మంది సభ్యత్వం రద్దు
- చైర్మన్ ప్రకటనపై పలువురు సభ్యుల నిలదీత

6

గాయత్రి పంపుహౌస్ నుంచి వరద కాలువకు నీటి విడుదల

- 3,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు



లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాయత్రి పంపుహౌస్ నుంచి వరద కాలువకు అధికారులు ఆదివారం నీటిని విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరద కాలువలో నీరు అడుగంటింది. వర్షాలు కురుస్తున్నాయని సాగు చేసి పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఈ విషయాన్ని రైతులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వివరించి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఆయన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గాయత్రి పంపుహౌస్‌కు చెందిన ఒక మోటర్‌ను ఆన్ చేసి 3,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డీఈ రాంప్రదీప్ తెలిపారు.. రామడుగు, గంగాధర, మల్యాల మండలాలకు చెందిన రైతులకు సాగునీటి సమస్య కొంతమేర తీరనుంది. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు గాయత్రి పంపుహౌస్ డెలివరీ సిస్టర్న్ వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగాధర: మండల పరిధిలోని వరద కాలువకు నీరు విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాగిరెడ్డిపూర్ వరద కాలువపై నిర్మించిన గేట్లను మూసి వేసి నీరును నిల్వ చేస్తున్నారు. కాలువలో నీటిమట్టం పెరిగింది. మండలంలోని నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి, కొండయ్యపల్లి, ర్యాలపల్లి సాగు నీరు అందనుంది.

బో'నమో' గంగమ్మ



బోనాలతో మహిళలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా బైపాస్‌రోడ్ మానేరు నదిలోని గంగామాత ఆలయంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర కులస్థులు ఇంటికో బోనం చొప్పున వివిధ ప్రాంతాల నుంచి డప్పు చప్పుళ్ళు, నృత్యాలు, భక్తి పారవశ్యంతో తరలి వచ్చి అమ్మవారికి ఒడిబియ్యం, వస్త్రాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దపల్లి జితేందర్, నాగుల రాజారాం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోసం అంజయ్య, గడప కోటేశ్, మాజీ అధ్యక్షుడు పర్రె రాజేశం, పెద్దపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మర్రి భావన సతీశ్, పెద్దపల్లి రవీందర్, గడప లక్ష్మీనారాయణ, సందిరి నరహరి, వివిధ డివిజన్‌ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఉద్యమిద్దాం

- సమష్టిగా పోరాడి బీసీ రిజర్వేషన్లు సాధించుకుందాం..
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు బలహీన వర్గాల ఉద్యోగులు, యువత, రైతులు, వివిధ రంగాల్లో ఉన్న వారంతా సంఘటితమై జేఏసీలుగా ఏర్పడి పోరాటం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని అసమానతలు గమనించారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపట్టి కులాల జనాభా ఆధారంగా రిజర్వేషన్ల అమలుకు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్ర కారం కులగణన సర్వే చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చట్టం చేసి, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీకి పంపించిందన్నారు. ప్రభుత్వపరంగా తమ బాధ్యతను పూర్తిస్థాయి లో నిర్వరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఢిల్లీలో కార్యక్రమమే కాకుండా బిల్లు ఆమోదంపొందే వరకు ఉద్యమం కొనసాగాల న్నారు. అన్ని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయ పార్టీలు, ప్రజలు బీసీ రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకిస్తే తమకు రాజకీయ ఉనికి ఉండదనే వాతావరణం కలుగజేసే బాధ్యత ప్రతి బలహీనవర్గాల బిడ్డపై ఉందన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కులగణన చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని, ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణన చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కవితవి కంటితుడుపు చర్యలని, కడుపులో కత్తులు పెట్టుకుని అడ్డుకోవడం వద్దు అని అన్నారు. నిర్ణయం ఆగిన వద్ద అడగకుండా హైదరాబాద్‌లో ధర్నాలు చేయడం రాజకీయ డ్రామాగా మంత్రి విమర్శించారు. రాజ్యాంగాన్ని వందలసార్లు సవరించుకున్నామని, ఇప్పుడు బీసీల 42 శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అందుకు అన్ని రాజకీ యపార్టీలు సహకరించాలని మంత్రి కోరారు. తెలంగాణ ఉద్యమంలో అందరూ భాగస్వామ్యులయినట్లు బీసీ రిజర్వేషన్‌లో భాగస్వాములు కావాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మోకాలడ్డితే రాబోయే కాలంలో కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు బిల్లును అమలు చేసి తీరుతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, సిరాజ్‌హుస్సేన్, ఎండీ తాజ్, పడాల రాహుల్, అనిల్ పాల్గొన్నారు.

నోటీసుల కలకలం

- ఆందోళనలో కరీంనగర్ సప్తగిరి, బతుకమ్మ కాలనీ వాసులు
- అన్ని అనుమతులున్నా ఎందుకు ఖాళీ చేయాలంటూ ప్రశ్న
- పరిహారం ఇస్తే తప్ప ఖాళీ చేసేది లేదంటున్న ఇళ్ల యజమానులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కొన్ని ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలంటూ నీటి పారుదల శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్ యాక్ట్ 2021 ప్రకారం లోయర్ మానేరు డ్యాంకు 200 మీటర్ల దూరంలోని ఇళ్లను వెంటనే ఖాళీ చేసి వెళ్లాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ నీటి పారుదల శాఖ అధికారులు నోటీసులు జారి చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాం సమీపంలోని సప్తగిరి, బతుకమ్మ కాలనీల్లో 30 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న 40 కుటుంబాలకు ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేశారు. మరికొన్ని ఇళ్లకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలియడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు.

● ప్రభుత్వం కేటాయించిన భూమిలో..

డ్యాం నిర్మాణ సమయంలో హస్నాపురం గ్రామం ముంపునకు గురైంది. వారికి నష్ట పరిహారంలో భాగంగా ప్రభుత్వమే కొందరికి ఇక్కడ స్థలాలను కేటాయించింది. మరి కొందరు భూములను కొనుగోలు చేసి మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకుని ఇళ్లను నిర్మించకున్నారు. 40 సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటూ మున్సిపాలిటీకి ఇంటి పన్నులు, నల్లా బిల్లులు చెల్లిస్తున్నామని ఇన్నాళ్ల తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని చెబుతున్నారు. ఇటీవల జాతీయ డ్యాం సేఫ్టీ అధికారుల బృందం పర్యటించి నిబంధనల మేరకు డ్యాం కట్టను అనుకుని 200 మీటర్లలోపు ఎలాంటి కట్టడాలు చేయవద్దని, వాటిని తొలగించాలని, చేసిన సూచనల మేరకే తాము నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇన్నాళ్ల నుంచి ఉంటున్న తమను ఇప్పటికిప్పుడు ఖాళీ చేసి పొమ్మంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లే ప్రసక్తే లేదని, డ్యాం కట్ట తెగితే కొట్టుకుపోతామే తప్ప ఖాళీ చేసి వెళ్లేది లేదని, అధికారులు నోటీసుల జారిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వేళ తప్పని సరిగా ఖాళీ చేయాలంటే తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు భయందోళనలకు గురి చేస్తే భయపడే ప్రసక్తే లేదని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ, బతుకమ్మ కాలనీ, హస్నాపూర్ కాలనీ వాసులకు నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడంపై మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ ఈఈని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఎల్ఎండీకి ఇరువైపులా ముళ్ల చెట్లు

- ఇబ్బందిపడుతున్న వాకర్స్, సందర్శకులు
- పట్టించుకోని ఎస్సారెస్పీ అధికారులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మానేరు జలాశయం(ఎల్ఎండీ) కట్టకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. రకరకాల చెట్లు ఏపుగా పెరిగి కట్టపై తారు రోడ్డును మూసివేస్తున్నాయి. దీంతో వాకర్స్, పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ముళ్ల పొదలు, సర్కార్ తుమ్మ, ఇతర పిచ్చిచెట్లతో డ్యాం కట్ట ఇరువైపులా చిత్తడి, మరుగుగా ఉండటంతో పాములు, తేళ్లకు ఆవాసంగా మారింది. ఇక డ్యాంకట్టపై కుక్కలు బెడద సరేసరి.. డ్యాం కట్ట కింద వాకింగ్ ట్రాక్‌లో, కట్టపై దారిలో కుక్కలు గుంపులుగా బైఠాయించడంతో వాకర్స్, సందర్శకులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు వేల మంది వాకర్స్ వస్తుంటారు.



ప్రమాదకరంగా రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్లు



ప్రమాదకరంగా ఉన్న చెట్లు

● వెలగని విద్యుత్ దీపాలు

మానేరు జలాశయం భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఎస్సారెస్పీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్యాం కట్ట భద్రతలో భాగంగా చెట్లను తొలగించేందుకు ప్రత్యేకంగా లష్కర్లు ఉంటారు. వారు ఇటువైపు రావడమే లేదు. డ్యాంకట్టపై విద్యుత్ దీపాలు ఎప్పుడు వెలుగుతాయో... ఎప్పుడు పనిచేయకుండా పోతాయో తెలియడం లేదు. వేకువజామున వాకింగ్‌కు వచ్చే మహిళలు ఇబ్బందిపడుతున్నారు. కట్టపై కుక్కలు కూడా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఓపెన్ జిమ్‌ల నిర్వహణ గాలికి..

మానేరు జలాశయం కట్ట కింది భాగంలో వాకర్స్ కోసం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రెండు చోట్ల ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను పట్టించుకోవటంలేదు. జిమ్ పరికరాలు వర్షానికి తడిసి, ఎండకు ఎండిపోవడంతో చెడిపోయాయి. ఎక్సర్‌సైజులు చేస్తే విపరీతమైన శబ్ధం వస్తుంది. కొన్ని పరికరాలు పనిచేయడంలేదు. దీనిపై వాకర్స్ ఫిర్యాదు చేయడంతో పాతవాటికి రంగులు వేసి చేతులు దులుపుకున్నారు.

విద్యుత్‌దీపాల సమస్య పరిష్కరించాలి
- ఎర్రోజు కనకాచారి, మానేరు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



మానేరు జలాశయం కట్టపై నిత్యం వేల మంది వాకింగ్‌కు, డ్యాం సందర్శనకు వస్తుంటారు. విద్యుత్‌దీపాలు సరిగా పనిచేయకపోవడంతో వేకువ జామున, రాత్రి వేళలో ఇబ్బందిగా ఉంది. డ్యాం కట్టపై చెట్లను తొలగించాలని. విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలి.

కర్రలుచేతపట్టుకుని వాకింగ్‌కు....
- బోయినిపల్లి నర్సింగరావు, తోటపల్లి మాజీ సర్పంచ్



వేకువజమున మూడు గంటల నుంచే డ్యాంకట్టపై సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు వాకింగ్ చేస్తుంటారు. కట్టపై గుంపులు గుంపులుగా కుక్కలు ప్రమాదకరంగా ఉన్నాయి. కుక్కల భయంతో చేతికర్రను పట్టుకుని వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కట్టకు రెండువైపులా చెట్లు విస్తరించి రోడ్డుపైకి రావడంతో పాములు, తేళ్ల, ఇతర కీటకాల సమస్య ఉంది.

- వరద కాలువపై రైతుల ఆశలు
- కథలాపూర్ మండలంలో రెండు వేల ఎకరాల్లో సాగు

సాగు నీరు అందేనా..?

కథలాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వరద కాలువపై ఆధారపడి పంటలు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వానలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. కథలాపూర్ మండలంలో పెగ్గెర్ల, ఊట్‌పల్లి, భూషణరావుపేట, కథలాపూర్, చింతకుంట, దుంపెట, తక్కళ్ళపల్లి, దూలూరు, బొమ్మెన గ్రామాలకు వరద కాలువ వర ప్రదాయినిగా ఉంది. ఈ కాలువపై ఆధారపడి సుమారు రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకున్నారు. వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతుండడంతో దిక్కు తోచని స్థితి దాపురించింది. కాగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులు అధైర్య పడవద్దని అనుకున్న మేర నీరు రాగానే అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.



ఎండిపోయిన వరద కాలువ

● రైతుల రాస్తారోకో

వరద కాలువలో పూర్తిగా నీరు ఎండిపోవడంతో పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు నీటి విడుదల కోసం ఇటీవల కథలాపూర్ మండల కేంద్రంలో పార్టీలకతీతంగా రాస్తారోకో నిర్వహించారు. కోరుట్ల ఆర్డీవోతో హామీతో ఆందోళన విరమించారు. రివర్స్ పంపింగ్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తుండగా నీటి నిల్వలు లేకపోవడంతో ప్రశ్నార్థకంగా మారింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి పంపింగ్ చేసేంత నీరు అందుబాటులో లేదని అధికార యంత్రాంగం స్పష్టం చేసిన క్రమంలో రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు పైభాగంలో ఉన్న ఎస్సారెస్పీలో కేవలం 40 టీఎంసీల నీరే ఉండగా వరద కాలువకు విడుదలకు అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వరద కాలువ గేట్ల వద్దకు నీరు వచ్చి చేరుతున్నందున కొన్ని రోజులు విడుదల చేస్తే పంటలకు మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు.



కథలాపూర్ మండలంలో వేసిన నాట్లు

నాలుగు ఎకరాలు ఎండిపోయింది

- చిట్యాల శ్రీనివాస్, రైతు కథలాపూర్



వరద కాలువపై ఆధారపడి నాలుగు ఎకరాల భూమి సాగు చేసుకున్నా. ప్రతీ ఏటా వరద కాలువలో నీరు పుష్కలంగా ఉంటుందనే ఆశతో పంటలు సాగు చేశా. మరో రెండు రోజులు ఎండలు కాస్తే పంటలు పూర్తిగా ఎండిపోతాయి. వరద కాలువకు ఏర్పాటు చేసుకున్న మోటర్ ఇప్పటికే రెండుసార్లు కాలిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు ఎండిపోయి భారీ నష్టం జరుగుతుంది.

కొన్ని రోజులు నీరు విడుదల చేయాలి

- మామిడి అంజయ్య, కౌలు రైతు



ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి మహారాష్ట్ర నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో వరద కాలువకు కొన్ని రోజులు నీరు విడుదల చేస్తే పంటలు కొంత మేర కాపాడుకునే పరిస్థితి ఉంటుంది. ఐదు ఎకరాలు కౌలుకు చేసుకుంటున్నా. నీరు విడుదల చేయకపోతే నష్టం తప్పేలా లేదు. మోటర్లకు నీరు అందడం లేదు. వరద నీటి కోసం ఆశగా చూస్తున్నాం.

భార్య మందలించిందని యువకుడి ఆత్మహత్య



నరేష్(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తీగల నరేష్(32) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తనుగుల సత్యనారాయణ తెలిపారు. నరేష్ గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 2న సాయంత్రం మద్యం తాగి వచ్చాడు. భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన నరేష్ అర్ధరాత్రి గడ్డి మందు తాగి మామకు తెలిపాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రతిమ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య మమతతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడు నరేష్ కళ్లను సదాశయ ఫౌండేషన్‌కు కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇద్దరు అంధులకు చూపు అందించడంపై ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

బావిలో దూకి వృద్ధురాలు..

చొప్పదండి (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాలపల్లికి చెందిన రాపెల్లి అనసూయ(65) శనివారం రాత్రి వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. అనసూయ నాలుగు సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం అనసూయ మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అనసూయ కుమారుడు రాపెల్లి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఓదెల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి మూల మలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గూడెంకు చెందిన మామిడి సంపత్ ఆదివారం తన చిన్ననాన్న ప్రథమ వర్ధంతికి హాజరై గూడెం నుంచి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇందుర్తి నీటి ట్యాంకు మూల మలుపు వద్ద వీణవంకకు చెందిన మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా గూడెంకు చెందిన మామిడి సంపత్‌కు తలకు తీవ్రగాయాలై విషమంగా ఉంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వీరిద్దరినీ జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

హోటల్స్, చికెన్ సెంటర్లపై అధికారుల దాడులు



చికెన్ సెంటర్ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు రెస్టారెంట్లు, చికెన్, టిఫిన్ సెంటర్లపై ఆదివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న పలు రెస్టారెంట్‌లు, చికెన్, టిఫిన్ సెంటర్ల యజమానులకు రూ. 13,500 జరిమానా విధించారు. భారీగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని నోటీసులను అందించారు. వినియోగదారులకు బట్ట సంచులు తెచ్చుకునే విధంగా యజమానులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్ మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వాలు నిషేధించాయని వాటిని వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపార కార్యకలాపాలలో వెలువడిన చెత్తను తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. లేకుంటే జరమానాలు విధిస్తామని తెలిపారు. ప్రతీ దుకాణదారుడు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే ఆశోక్, రికార్డు అసిస్టెంట్ జగదీశ్వర్, వార్డు అధికారులు మధు, రాహుల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది రమేష్, హేమంత్, జవానులు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో యువకుడి వీరంగం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తాను పెంచుకుంటున్న కుక్కలను ఎందుకు చంపుతున్నావని ప్రశ్నించిన పాపానికి యువకుడు కిరణ్ ఇంటిలోకి చొరబడి తండ్రికూతుళ్లపై దాడిచేసి వీరంగం సృష్టించిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వేణు తన ఇంటిలో కుక్కలను పెంచుకుంటున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కిరణ్ శునకాలను చంపేస్తున్నాడు. దాంతో తన కుక్కలను ఎందుకు చంపేస్తున్నావని వేణు నిలదీశాడు. మద్యం మత్తులో ఉన్న కిరణ్ అసభ్య పదజాలంతో దూషిస్తూ వేణు, అతడి కూతురు తనయపై దాడికి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడు వేణు ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మహిళను కాపాడిన హోంగార్డు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మహిళను హోంగార్డు రక్షించారు. గన్నేరువరం మండలం చీమలకుంట పల్లికి చెందిన మమ్ముత్ ఫౌజియా(25) కుటుంబ సమస్యల కారణంగా కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంలో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. లేక్ ఔట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎంఎ హఫీజ్ బేగ్ వెంటనే అప్రమత్తమై ఆమె సముదాయించారు. సురక్షితంగా లేక పోలీస్ ఔట్ పోస్టుకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు చేరుకున్న తర్వాత వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, భవిష్యత్‌లో ఇలాంటి నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళను కాపాడిన హోంగార్డు ధైర్యసాహసాలను ఉన్నతాధికారులు అభినందించారు.

బీసీ ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా విస్తరిస్తాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు - ఓబీసీ 10వ మహాసభ వాల్‌పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఉద్యమాన్ని భారత దేశ వ్యాప్తంగా విస్తరిస్తాం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ నెల 7న గోవాలో జరిగే ఓబీసీ 10వ మహాసభ వాల్‌పోస్టర్, కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ జనాభలో మేమెంతో అన్ని రంగాలలో మాకు అంతా వాటాను ఇవ్వాల్సిందేనని అన్నారు. 1990 ఆగస్టు 7న నాటి ప్రధాన మంత్రి వీపీ సింగ్ మొదటి సారిగా మండల కమీషన్ సిఫార్సులు అమలు చేస్తున్నట్లు ప్రకటించారని అప్పటి నుండి బీసీలంతా ఆగస్టు 7న మండల్ డేగా బావిస్తున్నారని అందుకే ఆగస్టు 7న ఓబీసీ మహాసభను గోవాలో నిర్వహిస్తున్నామన్నారు. బీసీల ఉద్యమాల వల్లే తెలంగాణలో కులగణన జరిగిందని దీంతో జాతీయస్థాయిలో కూడా జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులు డిల్లీలోని రాష్ట్ర పతి భవనంలో మూలుగుతున్నాయని వాటిని సాధించుకునే వారకు జాతీయ స్థాయి ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక శాఖ కేంద్ర బడ్జెట్‌లో బీసీల ధామాషా ప్రకారం నిధులు కేటాయించాలని బీసీ రిజర్వేషన్లు పెంచాలని చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ల కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ల రిజర్వేషన్లు కల్పించాలని బీసీ క్రిమిలేయర్ ఎత్తివేయాలని అన్నారు. దేశ వ్యాప్త బీసీ ఉద్యమంలో బీసీలంతా భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేష్‌యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా అధికార ప్రతినిధి బండారి బాల్‌రెడ్డి, బీసీ సేవా జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రవీన్, నాయకులు బోయిన శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, దుబాల కొండయ్య, తడుక విఠల్, కోడం రవీందర్, అర్చనపెల్లి శ్రీనివాస్, బూర అంజనేయులు, ఇల్లంతకుంట తిరుపతి, కంచర్ల రాజు, కందుకూరి రామాగౌడ్, సామల శ్రీనివాస్, రాపెల్లి సురేష్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

కొడుకు చేతిలో కత్తిపోట్లకు గురైన తండ్రి మృతి

- ఇద్దరు నిందితులపై కేసు నమోదు



రాయికల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని మత్తడివాడలో కొడుకు చేతిలో కత్తిపోట్లకు గురైన చిట్యాల లక్ష్మీనర్సయ్య(58) అనే వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. లక్ష్మీనర్సయ్యను అతడి కుమారుడు రాజేందర్ గత నెల 29న రాత్రి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనర్సయ్య వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని రాయికల్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. లక్ష్మీనర్సయ్య తనకున్న 10 గుంటల భూమి ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. తమ కు తెలియకుండా భూమిని ఎలా అమ్ముతావంటూ కుమారుడు రాజేందర్ తన స్నేహితుడైన అస్లాం సహకారంతో తండ్రిపై కత్తితో దాడి చేయగా ఎనిమిది చోట్ల గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని జగిత్యాలకు అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి కి తరలించి చికిత్స అందజేస్తుండగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులు రాజేందర్, అస్లామ్‌లను రిమాండ్ చేయగా తాజాగా హత్య కేసు నమోదు చేయను న్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

పాత కక్షలతో వృద్ధుడి హత్య

మల్లాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపల్లి గ్రామంలో పాత కక్షలతో సకినపల్లి కాసీం(62) అనే వ్యక్తిని శనివారం హత్య చేశారు. ఆదివారం మల్లాపూర్ ఎస్సై రాజు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వెంపల్లి గ్రామానికి చెందిన సకినపల్లి కాసీం కొడుకులతో కుల వృత్తి, వ్యవసాయం చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. పది సంవత్సరాల క్రితం కాసీం భార్య మృతి చెందడంతో ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. కాసీం ఇంటి పక్కన గల నాలుగు గుంటల భూమి నానం చిన్నహన్మండ్లు, నానం రాకేష్‌లకు విక్రయించాడు. ఇంటి వద్ద గల బాత్‌రూం గురించి గొడవలు జరిగి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో నానం చిన్నహన్మండ్లు, నానం రాకేష్‌లు కాసీంపై కోపం పెంచుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలోని పెద్ద కుమారుడి ఇంటి వద్ద భోజనం చేసి చిన్న కుమారుడి వద్దకు వెళ్తుండగా కాసీంను ఆపి నానం చిన్నహన్మండ్లు, నానం రాకేష్‌లు కట్టెలతో దాడిచేశారు. దీంతో తీవ్ర గాయాలతో కాసీం అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పారిపోయారు. మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్సైలు రాజు, కిరణ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పాత కక్షలతోనే హత్య చేసారని కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో పతకాలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభను కనబరిచి పతకాలను సాధించారు. ఆదివారం హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు బంగారు, రజిత పతకాలను సాధించారు. వివిధ వయస్సు విభాగాలలో ఎం లక్ష్మి 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 3000 మీటర్ల వాక్(నడక)లో రజిత పతకం సాధించింది. లావాణ్య 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 3000 మీటర్ల వాక్‌లో రజిత పతకం సాధించింది. సుల్తానా 1500 మీటర్ల పరుగు పెందెంలో బంగారు పతకం, 3000 మీటర్ల వాక్‌లో రజిత పతకాన్ని సాధించింది. పురుషుల విభాగం వివిధ వయస్సులో జెట్టి మహేందర్ లాంగ్ జెంప్‌లో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం సాధించాడు. అశోక్ 3000 మీటర్ల వాక్‌లో బంగార పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పతకాలను సాధించిన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.



పతకాలతో జిల్లా క్రీడాకారులు

రసాభాసగా అర్బన్ బ్యాంక్ సమావేశం

- కోర్టు ఉత్తర్వులతో గత పాలకవర్గం 15 మంది సభ్యత్వం రద్దు - చైర్మన్ ప్రకటనపై పలువురు సభ్యుల నిలదీత

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకర అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి అధ్యక్షతన కరీంనగర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. 2007 నుంచి 2017 వరకు ఉన్న పాలకవర్గం అవకతవకలకు పాల్పడినట్లు కోర్టు ఉత్తర్వులు జారీ చేసినందున వారి సభ్యత్వాలను రద్దు చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. విచారణ జరపకుండా, సభ్యుల సంజాయిషి తీసుకోకుండా సభ్యత్వాలు ఎలా రద్దు చేస్తారంటూ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు ఎజెండాలో అంశాన్ని ఎందుకు చేర్చలేదంటూ న్యాయవాది గోపాలకృష్ణ, సీనియర్ సభ్యుడు కళ్యాడపు ఆగయ్య ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు ప్రస్తుత పాలకవర్గ సభ్యులకు, గత పాలకవర్గ సభ్యులకు మధ్య కొద్దిపాటి వాగ్వాదం జరిగింది. కోరం లేదనే కారణంతో ఇటీవల జరిగిన సమావేశాన్ని వాయిదా వేశారని, ఇప్పుడు కూడా కోరం లేదని వాయిదా వేయకుండా ఎందుకు తీర్మానం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ 2007నుంచి జరిగిన ఓటరు జాబితా ట్యాంపరింగ్‌తోపాటు పలు అవకతవకలపై విచారణ జరిపిన అధికారుల నివేదిక ఆధారంగానే కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు, కోర్టు తీర్పు మేరకు బ్యాంకు ప్రయోజనాల దృష్ట్యా సభ్యత్వాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. బ్యాంక్ నిబంధనల మేరకు శాఖలకు పది కిలోమీటర్ల పరిధిలోపు మాత్రమే సభ్యత్వాలు ఇవ్వడంతోపాటు లావాదేవిలు జరపనున్నట్లు తెలిపారు. బ్యాంక్ సీఈవో నునుగొండ శ్రీనివాస్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

● ఇద్దరూ ఒకే పార్టీ

ప్రస్తుత చైర్మన్, మాజీ చైర్మన్ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగడం విశేషం. పదవుల కోసం ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించడం చర్చనీయాంశమైంది.

● సభ్యత్వాల రద్దు వివరాలు

సభ్యత్వాలు రద్దు అయిన వారిలో కర్ర రాజశేఖర్, ఎండీ షమియుద్దీన్, ఇ. లక్ష్మణ్ రాజు, వరాల జ్యోతి, దేశ వీద్రాద్రి, అనురాసు కుమార్, కె.రవి, సరిల్ల ప్రసాద్, వజీర్ అహ్మద్, తాటికొండ భాస్కర్, బాశెట్టి కిషన్, బొమ్మరాతి సాయికృష్ణ, దునిగంటి సంపత్, తాడ వీరారెడ్డి, ముద్దసాని క్రాంతి, సభ్యులు ఉన్నారు.

● న్యాయపోరాటం చేస్తాం

తప్పుడు ఆరోపణలతో సభ్యాత్వాలను రద్దు చేయడంపై న్యాయ పోరాటం చేస్తామని మాజీ చైర్మన్ రాజశేఖర్ అన్నారు. విచారణ లేకుండా, అంశాన్ని ఎజెండాలో చేర్చకుండా చైర్మన్, అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. న్యాయం తమవైపే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.





అర్బన్ బ్యాంకు మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, సమస్యలపై నిలదీస్తున్న మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, సభ్యులు

వ్యవసాయ బావుల వద్ద పెరుగుతున్న దొంగతనాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల వ్యవసాయ బావుల వద్ద దొంగతనాలు పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెద్ద లింగాపూర్, దాచారం, సిరికొండ తదితర గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టాటర్లు, విద్యుత్ వైర్ల అపహరణ వరుసగా జరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కేతిరెడ్డి నవీన్‌రెడ్డిల వ్యవసాయ బావుల వద్ద అపహరణ జరుగగా రెండు రోజుల క్రితం మాతిరెడ్డి కిషన్‌రెడ్డి, దాచారం గ్రామానికి చెందిన కొమ్ముల ప్రశాంత్, నర్సయ్యలకు చెందిన విద్యుత్ ఉపకరణాలు అపహరణకు గురయ్యాయి. రైతులు రాత్రివేళ ఇండ్లకు వస్తుండటాన్ని అదునుగా తీసుకుంటున్న దొంగలు అపహరణకు పాల్పడుతున్నారు. పోలీసులు గట్టి నిఘా చర్యలు చేపట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుచున్నారు. వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతు పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తామని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతతదేహం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి(55) మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కొత్తపల్లి పోలీసులకు సమాచారాన్ని అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదిలో భద్రపరిచినట్లు, గుర్తించిన వారు కొత్తపల్లి స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లతో పాటు రూ.4,350 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్‌ఐ ఉపేంద్రచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్దెనపల్లి గ్రామానికి చెందిన ఎండీ సమీర్, తంగళ్లపల్లి రాజేష్ మండల కేంద్రం శివారులో గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి నుంచి 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేరెల్లకు చెందిన విజయ్‌కుమార్ మార్చి 19న సెల్‌ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకున్నాడు. వెంటనే కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సెల్‌ఫోన్‌ను యజమాని విజయ్‌కుమార్‌కు కరీంనగర్ రూరల్ సీఐ అప్పగించారు.

ప్రశాంతంగా నీట్-పీజీ అర్హత పరీక్ష



తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

తిమ్మాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-పీజీ 2025 పరీక్ష కరీంనగర్ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తిమ్మాపూర్‌లోని శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 200 మంది, జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 80 మంది, ఐయాన్ డి జిటల్ జోన్‌లో 690 మంది, వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 200 మంది, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో 125 మంది, వివేకనంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో రెండు పరీక్ష కేంద్రల్లో కలిపి 250 మంది, హుజురాబాద్‌లోని కమలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 200 మంది మొత్తం 1745 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు రావల్సి ఉంది. శ్రీచైతన్యలో 176 మంది, జ్యోతిష్మతిలో 66, ఐయాన్ డిజిటల్ జోన్‌లో 600, వాగేశ్వరి పరీక్ష కేంద్రాంలో 173 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంట ల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకే సెషన్‌లో పరీక్ష జరిగింది. పరీక్ష సమయానికి రెండు గంటల ముందే ఏడు గంటల నుం చి 8.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

రామగిరి (ఆంధ్రజ్యోతి): మండంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రలో 99 మంది అభ్యర్థులకు గానూ 87 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించిన సిబ్బంది పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. రామగిరి ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

-ప్రాజెక్టులోకి 8,175 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు రావడం కొనసాగింది. డ్యామ్‌లోకి 8,175 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 39.707 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 30.211 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.551 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ఆలయం లేని దేవుడు.. ఆది వరాహుడు

- భక్తుల కోరిన కోర్కేలు తీర్చే స్వామి
- యేటా పెరుగుతున్న స్వామి విగ్రహం
- ఈనెల 5 నుంచి 7 వరకు జయంత్యుత్సవాలు

కమాన్‌పూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయం లేని దేవుడి ఆరుబయట ఉంటూ అందరికీ దర్శనమి స్తున్నాడు కమాన్‌పూర్‌లోని ఆదివరాహ స్వామి. అంతే కాకుండా మొదట రాతిపై మూషిక రూపంలో ఉన్న స్వామి యేటా పెరుగుతూ ప్రస్తుతం వరాహ రూపంలో దర్శనమిస్తున్నాడు. ఈనెల 5 నుంచి 7 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం విశిష్టతలపై కథనం.

కోరిన కోర్కేలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి. సుమారు 600 ఏళ్ల క్రితం ఒక రుషి తపస్సుకు మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. రుషి కోరిక మేరకు ఆదివరాహస్వామి రూపంలో వెలిసి భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. మొదట మూషికం మాదిరిగా చిన్నగా వెలసిన స్వామి రాతి విగ్రహం యేటా పెరుగుతుండటం ఇక్కడి ప్రత్యేకత. తిరుమల శ్రీవారి ఆలయం పక్కన ఆదివరాహ స్వామి ఆలయం ఉండగా మరో ఆలయం కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఉంది. కలియుగంలో స్వామి వారు లక్ష్మీదేవిని వెతుకుతూ వస్తున్న క్రమంలో ఆదివరాహుడు ఆశ్రయం కల్పించాడని, అప్పుడు



కమాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ద్వారం

తిరుమల తిరుపతి దేవస్థానానికి దర్శనానికి వచ్చే భక్తులు మొదట ఆదివరాహ స్వామిని దర్శించుకోవాలని వరం ఇచ్చినట్లుగా ఇతిహాసాలు చెబుతున్నాయి.

గతంలో ఒక భక్తుడు ఇక్కడ కోరిన కోరిక నెరవేరడంతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడట. అప్పుడు స్వామి భక్తుడికి కలలో కనిపించి తనకు ఆలయం నిర్మించవద్దని, ఆరు బయటనే ఉంటూ భక్తుల కోరికలు తీరుస్తానని చెప్పినట్లుగా పూర్వీకులు పేర్కొన్నారు. స్వామి వారు ఇక్కడ ఆరు బయటే ఉండి యేటా పెరుగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. అలాగే ఇక్కడి ఆలయ ప్రాంగణంలో బండ రాతిపై స్వామి వారి పాదాలు కూడా దర్శనమిస్తాయి.

ఏ సమస్యలు ఉన్నవారైనా ముడుపు కడితే వారి బాధలు తొలగిపోయి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఉంటాడని భక్తుల నమ్మకం. ఇక్కడికి ముఖ్యంగా భూ వివాదాల్లో చిక్కుకున్న వారు, అనారోగ్య సమస్యలున్న వారితోపాటు రాజకీయ నాయకులు, ఇతర రాష్ట్రాల ప్రజలు వస్తుంటారు. కోరికలు నెరవేరిన వారు భక్తుల సహకారాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

● ఆలయానికి మార్గం...

ఆదివరాహస్వామిని దర్శించుకోవాలంటే కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి నుంచి బస్సులు, రైళ్ల మార్గం కూడా అందుబాటులో ఉన్నది. కరీంనగర్ నుంచి పెద్దపల్లి మీదుగా కమాన్‌పూర్ మండలానికి నేరుగా బస్సు సౌకర్యం కూడా ఉంది. అలాగే గోదావరిఖని నుంచి యైటింక్లయిన్ కాలనీ మీదుగా కూడా బస్సులు, ఆటోల ద్వారా ఆలయానికి చేరుకునే అవకాశం ఉన్నది.



ఆదివరాహస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) ఆది వరాహుడు

5 నుంచి 7 వరకు జయంత్యుత్సవాలు

-వరప్రసాదాచార్యులు, ఆలయ ప్రధానాచార్యులు



ఆదివరాహ స్వామి ఆలయంలో నాలుగు నెలలుగా భక్తుల కోరిక మేరకు ప్రతీ మాసం కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. అలాగే ప్రతీ ఉగాదితోపాటు శ్రావణ మాసంలో స్వామి వారి జయంత్యుత్సవాలు జరుగుతాయి. కాగా ఈ నెల 5 నుంచి 7 వరకు జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం

- కొసన కాంతారెడ్డి, ఆలయ ఈవో



ప్రతీ శ్రావణ మాసంలో ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిసాం. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఇతర జిల్లాల నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి పెద్ద సంఖ్యలో వస్తారు.

సినారె పురస్కారం అందుకున్న తెలుగు అధ్యాపకుడు



డాక్టర్ ప్రమోద్ కుమార్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

జగిత్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహాకవి సి నారాయణరెడ్డి (సినారె) సాహితీ పురస్కారాన్ని జగిత్యాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్ అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు, కవి, విమర్శకులు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్‌కు సినారే సాహితీ పురస్కారం అందజేశారు. తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధ్దారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బైస దేవదాసు అతిథులుగా హాజరయ్యారు. ప్రమోద్ కుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

కేసీఆర్, అధికారుల ఆస్తులు జప్తు చేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఆస్తులను జప్తు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకురి శ్రీనివాస్, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మిరియా, జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, మహిళ జిల్లా అధ్యక్షురాలు లలిత, ఎల్లయ్య, గందె కొమురయ్య, అశోక్, శ్రీనివాస్, కవిత, మల్లేశం పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల పూజలు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో శ్రావణ ఆదివారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. అలాగే శ్రావణ ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

రైతుల ముందస్తు అరెస్టు

రామడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామడుగు బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులను ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామడుగు వాగుపై బ్రిడ్జి నిర్మించుటకు ఏడు సంవత్సరాల క్రితం నలుగురు రైతుల నుంచి భూములను అధికారులు సేకరించారు. పరిహారం ఇప్పటి వరకు రాకపోవడంతో రైతులు ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారుల చుట్టూ తిరిగారు. అలగే ఆందోళనలు కూడా చేపట్టారు. ప్రస్తుతం రామడుగు మండలానికి మంత్రులు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు పంపిణీ చేయడానికి వచ్చారు. దీంతో రైతులు ఆందోళన కార్యక్రమాలు చేస్తారేమోనని అనుమానంతో వారిని ముందస్తు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. రైతులు తాము నాలుగేళ్లుగా పరిహారం అందుకోడం కోసం ఎన్నో విధాలుగా ఇబ్బందులు పడుతున్నామని, తమను దొంగలను అరెస్టు చేసినట్లు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వంతెన కోసం భూములు ఇస్తే శిక్ష తప్పదా అని వారు వాపోతున్నారు.

కోటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- ఆలయ కమిటీకి అభినందన





మంత్రి అడ్లూరికి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌ను అభినందిస్తున్న మంత్రి

వెల్గటూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిలింగాలలో గల పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఆదివారం పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పూదరి రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ధర్మకర్తలు గుమ్ముల వెంకటేష్, బుద్దె రవి, రాపాక రాయకోటి, గొనె రాజిరెడ్డి, దేవి లావణ్య, మెరుగు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శాతవాహనుల తొలి రాజధానిగా ఖ్యాతికెక్కిన కోటిలింగాలలో కొలువైన కోటేశ్వర స్వామి దేవాలయానికి చైర్మన్‌గా, కమిటీ సభ్యులుగా నియామకం కావడం పూర్వ జన్మ సుకృతంగా భావించి ఆలయ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, కోసం అను నిత్యం కష్ట పడుతూ భక్తులకు ఇబ్బంది కలగ కుండా చూస్తానని అన్నారు. తనకు అవకాశం కల్పించిన మంత్రికి, సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలందర్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్లు మద్దుల గోపాల్ రెడ్డి, రాంమోహన్ రావు, వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, మెరుగు మురళి పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న మంత్రి

మండలం లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి వారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయన స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామి వారి శేష వస్త్రం కప్పి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారంతోనే అసలైన తెలంగాణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

సుభాష్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం రావడమే అసలైన తెలంగాణ అని బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఆదివారం నగరంలో జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు వచ్చిన తెలంగాణ వెలమ-రెడ్డి వర్గాలకు సంబంధించిన రాష్ట్రమన్నారు. నాడు తెలంగాణ జేఏసీ రెడ్డి-వెలమలకు రాజ్యాధికారం అప్పచెప్పితే, నేటి బహుజన జేఏసీ మాత్రం అణగారిన కులాలకు అధికారం అప్పచెబుతుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం భారీ యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. తెలంగాణలోని అణగారిన వర్గాల రాజ్యాంగ హక్కుల కోసం లక్ష కిలోమీటర్ల మా భూమి, రథయాత్ర ప్రారంభమైందని, త్వరలోనే ఈ యాత్ర కరీంనగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు బీజేపీ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చేసిందేమీ లేదన్నారు. బహుజన సమాజాన్ని, బహుజనవాదాన్ని అణగదొక్కడమే వారి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు రామేందర్, విదోద్, సభ్యులు శ్రీకాంత్, రాము, కార్తిక్, ఏకలవ్య, బీసీ సంఘాల నాయకులు, రణధీర్‌సింగ్, నరేష్, మనోజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాస భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. ఆలయం పక్షాన ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● దేవాదాయ అడిషనల్ కమిషనర్ దంపతుల పూజలు



కూరాకుల జ్యోతి దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద వారికి వేదపండితులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో నిర్వహించిన అభిషేకంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి యుగేందర్

చిగురుమామిడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులకు వెంటనే జీవనో పాధి కల్పించి ఆదుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రామండ్ల యుగేందర్ అన్నారు. అదివారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏఐవైఎఫ్ మండల స్థాయి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయి చదువులు చదివి సరైన ఉపాధి లేక అనేక మంది నిరుద్యోగులు రోడ్ల వెంట తిరుగుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా కోటి ఉద్యోగలు ఇస్తామని చెప్పి యువతను తప్పుదారి పట్టించారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పైడిపల్లి శశి, చెంచల రవి, మహేశ్, రాకం శ్యామ్, హరీష్, నవీన్, వెంకట్, కార్తిక్, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుగేందర్

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- స్వామివారి దర్శనానికి గంటల తరబడి నిరీక్షణ
- కోడెమొక్కులు, కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు







రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు, కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు, విక్రయ కేంద్రంలో లడ్డూలను పరిశీలిస్తున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వర స్వామివారి శైవక్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. రాష్ట్రం నలుమూలలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ఆవరణతో పాటుగా ప్రాంగణం రద్దీగా కనబడింది. శ్రావణమాసం ఆదివారం సందర్భంగా భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు మూడు గంటలపాటు క్యూలైన్‌లో వేచిఉన్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరకున్నారు. రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని రాజరాజేశ్వరీ అమ్మవారికి నూతన వస్త్రాలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించకున్నారు. ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. రాజరాజేశ్వర స్వామిని మహారాష్ట్ర రాష్ట్ర రవాణా సంస్థ కమిషనర్ వివేక్ భీమన్వార్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నా రు.

ఆకట్టుకున్న లంబోదర కల్చరల్ డాన్స్ ఫెస్టివల్..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఆదివారం లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రావణ మాస శివపాద నృత్యనీరాజనం 2025 సంగీత, నృత్య ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంతో పాటు గా ఇతర రాష్ట్రాల నుంచి నాట్య గురువులు, కళాకారులు, తల్లిదండ్రులు, బాలకళాకారులు హాజరయ్యారు. ఈ మహోత్సవానికి రాజన్న ఆలయ ఈవో రాధాబాయి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి కళాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు.

పలు విభాగాలను పర్యవేక్షించిన ఈవో..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని ప్రధాన విభాగాలను ఈవో రాధాబాయి ఆదివారం పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఈవో మెయిన్ టెంపుల్, ప్రసాద విక్రయ విభాగం, ప్రొటోకాల్ విభాగం, సెంట్రల్ గోదాం, బుకింగ్ కౌంటర్, ప్రచార శాఖ, భక్తుల సమాచార కేంద్రాల్లో నిర్వహణ తీరును సమీక్షించారు. అధికారులు, సిబ్బందితో సమావేశంలో ప్రసాదాల తయారీలో ఉపయోగించే పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వామివారికి నివేదించే ప్రసాదం శుద్ధి, ప్రమాణాలపరంగా లోపం లేకుండా ఉండేలా చూడాలని సూచించారు. సెంట్రల్ గోదాంలో సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, టికెట్ కౌంటర్లలో జరిగే లావాదేవీలు, సమాచార కేంద్రాల్లో భక్తులకు అందే సేవలపై సమీక్ష జరిపారు. టికెట్ల జారీ విధానం సక్రమంగా కొనసాగాలని, ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. భక్తులకు సమాచార కేంద్రంలోని సిబ్బంది భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రసాద నాణ్యతలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రతి విభాగంలో రికార్డుల నిర్వహణ సరైన విధంగా కొనసాగించాలని ఉద్యోగులకు, సిబ్బందికి సూచించారు.

● సంక్షిప్తంగా..

గన్నేరువరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొమ్మెర రవీందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆరోగ్య హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు పంచాయతీ ఆవరణలో అక్రమంగా నిర్మించిన షాపులను తొలగించాలని గ్రామస్థులు అశోక్, రాజశేఖర్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

సుభాష్‌నగర్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భగత్‌నగర్‌లోని మిత్ర అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ బీరకాయల పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: తుమ్మనపల్లిలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు.

భగత్‌నగర్: రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో కొత్తపెల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి బండ కిషన్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక భగత్‌నగర్‌లోని అయ్యప్ప ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణమండపం ప్రారంభిస్తారని ఆలయ చైర్మన్ వై.అనిల్‌కుమార్, ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: బెంగుళూరు యూనివర్సిటీ వేంకటగిరి గౌడ సభా ప్రాంగణంలో తెలుగు అధ్యయన శాఖ సోమవారం నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో నగరానికి చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌కు ఆహ్వానం అందింది.

గంగాధర: గంగాధర మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన నాగారపు శ్రీనివాస్‌కు స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డును అందుకున్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని కేసీ క్యాంపులోని వైశ్య సదన్ ప్రాంగణంలో ఆర్యవైశ్య వనభోజన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్, హరిశంకర్, శ్రీనివాస్, సురేష్, నాగరాజు, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: మెగా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఆదివారం బిర్లా సైన్స్ మ్యూజియంలో కీర్తి రత్న పురస్కారం, ఐకాన్ గోల్డెన్ టాలెంట్ అవార్డును తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయుడు మానువాడ శంకర్‌కు అందజేశారు.

మంత్రులకు ఘన స్వాగతం




స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లాకు వచ్చిన మంత్రులకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పెద్దపల్లి జిల్లా పర్యటన అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ హెలికాప్టర్‌లో జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఎండీలోని క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజి వాకడే, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ప్రత్యేకవాహనాల్లో శంకరపట్నంలో రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు వెళ్లారు.

శంకరపట్నం: హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిమ్మాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు. కేంద్రంలో విద్యుత్ సరఫరా లేకపోవడం, ఒకే గదిలో నిర్వహించడం, టాయిలెట్లు లేకపోవడం, పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగడం వంటి సమస్యలపై 'సమస్యల నిలయం.. అంగన్‌వాడీ కేంద్రం' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీవో శ్రీమతి, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేందర్ ఆదివారం ఉదయం అంగన్వాడీ కేంద్రానికి చేరుకున్నారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించారు. తాత్కాలికంగా విద్యుత్ సరాఫరను పునరుద్ధరించారు. కేంద్రంలో కావల్సిన ఏర్పాట్లపై కలెక్టర్‌కు నివేదిక పంపామని, నిధులు మంజురవగానే సౌకార్యలు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడింది కమ్యూనిస్టులే

జమ్మికుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్యం కోసం పోరాడింది కమ్యూనిస్టులే అని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసేది కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. 1920లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ దేశం కోసం, ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. నేడు బూర్జువా భూస్వామ్య ప్రభుత్వాలు కార్పొరేట్ విధానాలను అవలంబిస్తూ పారిశ్రామికవేత్తలకు మేలు కలిగిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అశోక్, శంకర్, సమ్మయ్య, కిషోర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గూడు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని అలుగునూర్‌లో పలువురు లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఇళ్లు మంజూరు చేయక నిరుపేదల్లో నిరాశ మిగిల్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేస్తూ వారి సొంతింటి కలను సాకారాం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు ఎస్ఎల్ గౌడ్, కాల్వ మల్లేశ్, చిందం కిష్టయ్య, అయితం మహేష్ పాల్గొన్నారు.

భాషాపండితులకు పదోన్నతులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భాషాపండితులకు పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా అన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 800 భాషాపండితుల పోస్టులు ఉన్నతీకరణకు ప్రభుత్వానికి ఫైల్ పంపించేందుకు కృషి చేశామన్నారు. రాష్ట్ర కోశాధికారి నాగుల భిక్షపతి, మధుసూదన్ రెడ్డి, గోపాల్, జహీంగర్, స్వామి, సునీత, బాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చైతన్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

చొప్పదండి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో రాష్ట్ర మంత్రుల పర్యటన దృష్ట్యా మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వదిలిపెట్టారు. పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, యువజన విభాగం నియోజవర్గం ఇన్‌చార్జి బందారపు అజయ్ తదితరులు ఉన్నారు.

డ్యూటీ మీట్‌లో సీఐడీ ఎస్సైకి స్వర్ణం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్-2025లో కరీంనగర్ సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఎస్సై జి.సుమలత ఫొటోగ్రఫీ విభాగంలో స్వర్ణం పతకం గెలుచుకున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్ జిల్లా మమునూర్‌లోని పోలీస్ శిక్షణా కేంద్రంలో పోటీలు నిర్వహించారు. నేరస్థలాల ఫొటోగ్రఫీ విభాగంలో ఎస్సై ప్రదర్శన కనబరిచారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

చొప్పదండి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ, చంద్రశేఖర్, సాయిరాం, కార్యదర్శిగా మణిసాయి, కోశాధికారిగా సాయి విక్రాంత్ ఎన్నికయ్యారు. మండల ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా గోపికృష్ణ, కోశాధికారిగా తాటిపెల్లి శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా సందీప్, కోశాధికారిగా సముద్రాల రాజు ఎన్నికయ్యారు.

శ్రీవారి ఆలయం కోసం చంద్రబాబును కలుస్తా



తిరుమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలవనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మాణం కోసం తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ 10 ఎకరాల భూమిని కేటాయించారని, రెండేళ్ల గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ఈ అంశంపై టీటీడీ అదనపు ఈవోతోనూ మాట్లాడినట్లు చెప్పారు. ఆనవాయితీలో భాగంగా ప్రతీ మూడు నెలలకో సారి శ్రీవారిని దర్శించుకుంటున్నట్లు చెప్పారు.

వైభవం.. శ్రీనివాస కల్యాణం



తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా యజ్ఞ వరాహక్షేత్రంలో శ్రీనివాస కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు.కల్యాణాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

భగత్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐ వైఎఫ్ చిగురుమామిడి మండల మహాసభను సీపీఐ కార్యాలయంలో శశి అధ్యక్షతన నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని సంఘం పోరాటాలు నిర్వహించిందన్నారు.

మండలంలో సాధారణ వర్షపాతం

- వరిసాగుపై రైతుల్లో ఆందోళన

కరీంనగర్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాధారణ వర్షపాతం నెలకొనడంపై వరి సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకే నాట్లు పూర్తి కావల్సి ఉండగా వర్షాబావ పరిస్థితులతో 40శాతం కూడా వరి సాగు కాలేదు. ఆగస్టు 15వరకు వర్షపాతం పూర్తిస్థాయిలో నమోదైతే వరి నాట్లు వేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా నారు మడులు ముదిరిపోతాయని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లో నీరు చేరి భూగర్భజలాలు పెరుగుతాయని ఆశించిన రైతులకు నిరాశనే మిగిలిపోయింది. మండలంలో ప్రధానంగా బావులు, బోర్లపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి నీటి వనరులు జలకళను సంతరించుకుంటేనే భూగర్భ జల మట్టం పెరుగుతుంది. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి, మొక్కజొన్న, కంది, పెసర తదితర ఆరుతడి పంటలకు జీవం పోశాయి. మండలంలో 372.8మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా సాధారణ వర్షపాతం నమోదైంది. కరీంనగర్ రూరల్ మండలంలో 72 పెద్ద చిన్న చెరువులతోపాటు కుంటలు ఉన్నాయి. మొత్తం చెరువుల్లో 25శాతం నుంచి 50శాతం నిండిని చెరువులు 28 మాత్రమే ఉన్నాయని అధికారులు తెలిపారు. వరణుడు కరుణిస్తేనే ఈ సారి పంట చేతికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

అల్ఫోర్స్‌లో స్నేహితుల దినోత్సవం



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

భగత్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా స్నేహబంధాలను పెంపొందించుకొని సమాజ అభివృద్ధివైపు అడుగులు వేయాలని సూచించారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డికి ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఇంటింటికి బీజేపీలో భాగంగా వీణవంక మండలం బేతిగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● మానకొండూరు: కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గంగిపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కె రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కేంద్ర ఫిలింబోర్డు సభ్యుడు రంగు భాస్కరాచారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అండటి తిరుపతి, నాయకులు రాజిరెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హుజూరాబాద్‌లో మాతృశ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు



కరీంనగర్‌లో..

జమ్మికుంట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విస్‌డమ్ జూనియర్ కళాశాల 2007-2009 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో దబ్బెట రవీందర్, బండి ప్రభాకర్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని చాణక్య ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఒకే చోట కలుసుకున్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాతృశ్రీ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల 2008-13 బ్యాచ్ విద్యను పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కళాశాల డైరెక్టర్ సంపత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ 1996-97 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆకట్టుకుంది. 28 సంవత్సరాల తర్వాత నగరంలో ఓ ఫాంహౌస్‌లో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకే
సన్న బియ్యం

(5వ పేజీ తరువాయి)

కష్టమైనా ఇచ్చిన హామీల మేరకు పథకాలను కొనసాగిస్తుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సివిల్ సప్లయిస్ కమిషనర్ చౌహాన్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, వెలిచాల రాజేందర్‌రావు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి పాల్గొన్నారు.

● సహకార సంఘ భవనం ప్రారంభం

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం నూతన భవనాన్ని ఆదివారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముంబ్యాంకు, సింగిల్ విండో వ్యవస్థాపక అధ్యక్షులు అనభేరి వెంకటరమణరావు విగ్రహన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, సింగిల్ విండో అధ్యక్షులు అనభేరి రాధాకిషన్‌రావు. ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

● బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

రామడుగు: ఏపీ ప్రభుత్వం గోదావరి నదిపై చట్ట వ్యతిరేకంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆదివారం రామడుగు మండలంలోని షానగర్‌లో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. మిగులు జలాలపై తెలంగాణ రాష్ట్రానికి ఉన్న వాటా ముందుగా తేలాలని అన్నారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మంత్రి విమర్శించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.

జానపదుల జీవన కలబోత 'పున్నమి పూత'



పుస్తకం ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రచయిత బొల్లం బాలకృష్ణ రచించిన 'పున్నమి పూత' అక్షరాల జానపదుల జీవన కలబోత అని సీనియర్ పాత్రికేయ కవి నగునూరి శేఖర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో నిర్వహించిన పుస్తకా విష్కరణలో మాట్లాడారు. వెన్నెల వెలుగులను సమాజానికి అంతటా పరివ్యాప్తం చేయడానికి కవి ఆరాటపడుతున్నాడన్నారు. మెరుగు ప్రవీణ్ పుస్తక పరిచయం చేశారు. అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ భాగ్యరెడ్డి, శంకరయ్య, డాక్టర్ విజయకుమార్, రామంచ తిరుపతి, సీవీ కుమార్, రమణయ్య, నాగభూషణం, నిర్మలారాణి పాల్గొన్నారు.

నాగారపు శ్రీనివాస్‌కు ప్రత్యేక అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగారపు శ్రీనివాస్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం హనుమాన్ దేవాలయం, కరీంనగర్ జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయ కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న నాగారపు శ్రీనివాస్ ప్రత్యేక అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో లలిత కళా సమాఖ్య వారు సేవా వైభవ రత్న పేరుతో 31వ స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డు ప్రదానం చేశారు. ఈఓగా విధుల నిర్వహణ, గంగాధర మండలం గోపాల్‌రావుపేటలో చేసిన గ్రామీణ అభివృద్ధి, సామా జిక సేవలకు గుర్తింపుగా అవార్డు అందజేసినట్లు నిర్వాహకులుతెలిపారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో కశ్మీర్‌గడ్డ వాకర్స్ సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కశ్మీర్‌గడ్డ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు కేక్ కట్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి, సభ్యులు ఆది శ్రీనివాస్, జావిద్, సిద్ధం వేణు, విద్యాసాగర్, నారాయణ, లక్ష్మీనారాయణ, సైపుద్దీన్, బాబా, రాము, శ్రీనివాస్, వంగపల్లి సూర్యప్రకాశ్, సభ్యులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ చెస్ అకాడమీలో...

నగరంలోని జ్యోతినగర్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. అకాడమీ డైరెక్టర్, కోచ్ ఏషియన్ బ్రాంజ్ మెడలిస్టు విశ్వనాథ ప్రసాద్ పాల్గొన్నారు.

తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్ అసోసియేషన్

గణేశ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్ అసోసియేషన్ జిల్లా స్థాయి ఎన్నికలు ఆదివారం నగరంలో ఎన్నుకున్నారు. కరీంనగర్ సర్కిల్ అడ్వయిజర్‌గా ఒ.లక్ష్మయ్య, ప్రెసిడెంట్‌గా గుండు శ్రీనివాస్, సెక్రటరీగా సంపత్ కుమార్, ఆర్గనైజషన్ సెక్రెటరీగా కట్ట నిఖిల్, ట్రెజరర్‌గా ఆరెపల్లి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. కరీంనగర్ టౌన్ డివిజన్ సెక్రటరీగా ఎస్.చంద్రశేఖర్, ట్రెజరర్‌గా జె.మహేష్, కరీంనగర్ రూరల్ డివిజన్ సెక్రెటరీగా ఎం.వీరచారీ, ట్రెజరర్ డి.శంకర్, హుజూరాబాద్ డివిజన్ సెక్రెటరీగా వి.సురేశ్వరచారి, ట్రెజరర్‌గా ఆర్.విక్రమ్ తేజ తదితరులను ఎన్నుకున్నారు.

పార్టీలకు అతీతంగా మున్నూరు కాపులను గెలిపించుకోవాలి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా మున్నూరు కాపులను గెలిపించుకోవాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ అన్నారు. ఆదివారం ధర్మారం దుబ్బ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఏబూషి శ్రీనివాస్, మండల అధ్యక్షుడిగా తోట లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజేందర్ ఎన్నికయ్యారు.

11న పెన్షనర్ల 'చలో హైదరాబాద్'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చందుపట్ల జనార్దన్ రెడ్డి, గడ్డం అశోక్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణచారి ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. మహాధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

హుజూరాబాద్: మహా ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన మాటాడారు.